ప్రవేశిక

సహృదయపాఠకుల కరకమలాలను అలంకరించిన ఈ గ్రంథం ఆంధ్రమహాభాగవతంలోని షష్ఠస్కంధం. ఈ స్కంధాన్ని అనువదించిన కవి ఏర్చూరి సింగయగారు. వీరిది శ్రీవత్సగోత్రం. ఆపస్తంబసూత్రం. తల్లిపేరు ముమ్మడమ్మ, తండ్రిపేరు కసువయమంత్రి.

సింగయగారి నివాసస్థానం ఓరుగల్లు మండలంలో ఉన్న ఏర్చూరు. గ్రామ నామమే గృహనామంగా మారింది.

సింగయగారికి పోతన్న గారంటే వల్లమాలిన భక్తి. ఆయన కవిత్వమంటే ఎంతో ఇష్టం, ఎంతో గౌరవం. అందుకనే పోతన్న గారి భాగవతానికి సమగ్రత సమకూర్చటం కోసం షష్ఠస్కంధాన్ని అనువదించటానికి పూనుకొన్నారు.

పోతనగారివలెనే సింగయగారు కూడా గ్రంథారంభంలో ఇష్టదేవతా వందనమూ, కవిస్తుతీ, స్వప్నవృత్తాంతమూ, కవివంశవర్ణనమూ, షష్ఠ్యంతాలూ రచించారు. సంస్కృత కవీంద్రులనూ, నన్నయ తిక్కన ఎఱ్ఱనలనూ, భాస్కరుణ్ణీ, నాచనసోమనాథుణ్ణీ, శ్రీనాథుణ్ణీ ఒకే ఒక సీసపద్యంలో సంస్తుతించిన తర్వాత సింగయగారు బమ్మెరవారికోసం ప్రత్యేకంగా ఒక ఉత్పలమాలను కూర్చి సమర్పించి మ్రొక్కు చెల్లించారు. చిత్తగించండి-

ఎమ్మెలు సెప్పనేల? జగమెన్నఁగఁ బన్నగరాజ శాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూఱలు చేసినవాని భక్తిలో
నమ్మినవాని భాగవత నైష్ఠికుఁడై తగువానిఁ బేర్మితో
బమ్మెరపోతరాజు కవిపట్టపురాజుఁ దలంచి మ్రొక్కెదన్. **(షష్ఠ. స్కం. 12)**

ఈ పద్యంలో పోతరాజుగారిని కవి పట్టపురాజుగా అభివర్ణించడమూ భాగవత నైష్ఠికునిగా పేర్కొనడమూ సింగయగారికి బమ్మెరవారి పట్లగల భక్తి ప్రపత్తులకు చక్కని నిదర్శనం.

పోతన్నగారు చెప్పుకున్నట్లే సింగయగారు తమ పూర్వులు శివభక్తియుక్తులనీ తాను "శివపూజందనరినవాఁడ"ననీ చెప్పుకున్నారు. పోతన్నగారికి శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించినట్లే సింగయ్యగారికి స్వప్నంలో దేవవాణి సరస్వతీదేవి సాక్షాత్కరించింది - ఆ జగన్మాతను ఆయన ఇలా వర్ణించారు -

ఉరవడి ప్రాగ్వీథి నుదయించి మార్తాండ కోటిబింబచ్ఛాయ గూడినట్లు
హరి హర బ్రహ్మల యాత్మలలో నుబ్బి కరుణ యొక్కట మూర్తి బెరసినట్లు
ఖరకర కర తీవ్ర గతినిఁ గరంగుచు హేమాద్రి సోగ పెల్లెగసినట్లు
ఫణిరాజ ఫణరాజి మణిగణ విస్ఫూర్తి సుషిరంపు వెలిదల చూపినట్లు

ఉట్టిపడ్డట్లు కట్టెట్టు నూఁదినట్లు, తేజ మెసఁగంగ నామ్రోల దివ్యవాణి
పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టిఁ, జూచి యిట్లని పలికె మంజులముగాను. (షష్ఠ. స్కం.17)

పోతనగారు తమ తల్లిగారైన లక్కాంబ గుణగణాలను ఈ విధంగా వెల్లడించారు -

నడవదు నిలయము వెలువడి, తడవదు పరపురుషుగుణముఁ దనపతి నుడువుం
గడవదు వితరణ కరుణలు, విడువదు లక్కాంబ విబుధ విసరము వొగడన్.

సింగయ్యగారు కూడా తమ మాతృదేవి ఐన ముమ్మడమ్మను గూర్చి ఇటువంటి పద్యమే వ్రాశారు-

ఆడదు భర్తమాట కెదురాడదు వచ్చినవారి వీడఁగా
నాడదు పెక్కుభాష లెడనాడదు వాకిలి వెళ్లి కల్ల మా
టాడదు మిన్నకేని సుగుణావళి కిందిరగాక సాటి యే
చేడియ లేదు చూరికులశేఖరు కస్వయముమ్మడమ్మకున్. (షష్ఠ. స్కం. 27)

ఈ పద్యం నాలుగో పాదంలో చిన్నపేచీ ఉన్నది. వావిళ్లవారి ప్రతిలోనూ, వేమూరివారి ప్రతిలోనూ కూడా ఈ పద్యం ఈ విధంగానే ముద్రితమైనది.

ముమ్మడమ్మకు ఇందిరగాక సాటి ఏ చేడియ లేదు అని విడదీసి అర్థం చెప్పవచ్చుగాని తర్వాత ఉన్న "చూరికులశేఖరు" అన్నదానికి సరైన అర్థం కుదరదు. కొందరు పెద్దలు 'చూరి'ని 'సూరి'గా మార్చి 'సూరి కులశేఖరు' అని అర్థం చెబుతామన్నారు గాని అది సరసమూ సముచితమూ కాదు.

సాహిత్య అకాడమీ వారి ప్రతిలోకూడా పై పద్యం పై విధంగానే ముద్రించి అధోజ్ఞాపికలో "చేడియ లేరుచూరి కులశేఖరు" అని యుండనగును - అని సూచించారు. నిజానికి దే సరసమైన పాఠం.

ఇదంతా ' ఏరుచూరి' అన్నది సింగయ్యగారి ఇంటిపేరని గుర్తించక పోవడం వల్ల వచ్చిన గందరగోళం. సింగయ్యగారు తన ముత్తాత గారిని "ఏర్చూరిశాసను" డని స్పష్టంగా పేర్కొన్నారు.

'చేడియ' ఏకవచనం కనుక 'లేదు' అనే క్రియకూడా ఏకవచనం లోనే భ్రాంతి మూలకంగానో 'రు' 'దు' అక్షరాల రూపసాదృశ్యం వల్లనో, లేఖక ప్రమాదం వల్లనో అసంగతమైన పాఠం అన్ని ప్రతులలో చోటు చేసుకున్నది.

"చేడియ లేరుచూరికులశేఖరు కస్వయ ముమ్మడమ్మకున్"అన్నదే సరైన పాఠం. ఇందిరగాక సాటియే చేడియలు ఏరుచూరికులశేఖరు కస్వయ ముమ్మడమ్మకున్ - అని విడదీసి చెప్పుకుంటే పద్యం హృద్యంగా ఉంటుంది. అర్థం సుసంగత మౌతుంది.

పోతన్నగారి వలెనే సింగయకూడా భాగవతాన్ని అనువదించే సందర్భంలో తన వినయ వినమ్రతలను ప్రదర్శించాడు -

"భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు, శూలికైన తమ్మి చూలికైన
విబుధవరుల వలన విన్నంత కన్నంత, తెలియ వచ్చినంత తేటపఱుతు." **(ప్రథ. స్కం.17)**

అన్న పోతన్నగారి పద్యానికి ప్రతిగా సింగయ్య ఇలా వ్రాశారు -

భాగవతము తేటపఱుప నెవ్వఁడు సాలు, శుకుఁడు దక్క నరుని సఖుఁడు దక్క
బుద్ధిఁ దోఁచినంత బుధులచే విన్నంత, భక్తి నిగిడి నంత పలుకువాఁడ. **(షష్ఠ.స్కం.23)**

సింగయ్య కవితాధార ధారాళంగా గంగాప్రవాహంలాగా సాగిపోతుందనటానికి ఈ క్రింది పద్యం మచ్చుతునుక -

ఆడించున్ హరి దివ్యనాటక గుణవ్యాపార నృత్యంబులం
బాడించున్ జలజాతనేత్ర బిరుద ప్రఖ్యాత గీతంబులం
గూడించున్ సతతంబు జిహ్వలతుదిన్ గోవిందనామావళుల్
క్రీడిం గిన్నర యక్ష కామినులచేఁ గృష్ణార్పిత స్వాంతుఁడై. **(షష్ఠ. స్కం. 484)**

చిన్న చిన్న పదాలతో భావాన్ని ప్రస్ఫుటం చేయటంలో ఈయన అందెవేసిన చెయ్యి. వృత్రాసురుడు రణరంగంలో జబ్బచరచి బొబ్బపెట్టిన సందర్భాన్ని వర్ణించాడు చూడండి -

కూడె జగంబు లన్నియును, గ్రుంకిరి సూర్య సుధాంశు, లద్రు లూ
టాడె, నభస్థలం బగిలె, నంబుధు లింకె, నుడుగ్రహాళి స
ట్టాడె, వడిందిశల్ వగిలె, నుర్వర గ్రుంగె. నజాండభాండ మ
ల్లాడె, విధాత బెగ్గడిలె నార్చుచు వృత్రుఁడు బొబ్బవెట్టినన్. **(షష్ఠ. స్కం. 384)**

సంస్కృతమూలాన్ని ఉన్నది ఉన్నట్లుగా చక్కగా సరసంగా సింగయ తెనిగించడంలో కృతకృత్యుడైనా డనటంలో సందేహం లేదు -

అజాత పక్షా ఇవ మాతరం ఖగాః, స్తన్యం యథా వత్సతరా క్షుధార్తాః,
ప్రియం ప్రియేవ వ్యుషితం విషణ్ణా, మనోఽరవిందాక్ష! దిదృక్షతే త్వామ్. **(భాగ. షష్ఠ. 11.26)**

ఆఁకలిగొన్న క్రేపులు, రయంబున నీఁకలురాని పక్షులుం
దీకొని తల్లికిన్, మఱి విదేశగతుం డగు భర్త కంగజ
వ్యాకుల చిత్తయైన జవరాలును దత్తఱమందు భంగి, నో
శ్రీకర! పంకజాక్ష! నినుఁ జేరఁగ నా మది గోరెడుం గదే! **(షష్ఠ-స్కం -400)**

పోతన్నగారివలెనే అక్కడక్కడ మూలాన్ని రసవంతంగా పెంచి వ్రాయటంకూడా సింగయ కవిత్వంలో మనం చూడవచ్చు. విద్యాధర చక్రవర్తి ఐన చిత్రకేతువు భగవంతుడైన ఆదిశేషుణ్ణి సందర్శించిన సందర్భం మూలంలో ఇలా ఉన్నది -

మృణాలగౌరం శితివాససం స్ఫురత్, కిరీటకేయూర కటిత్ర కంకణమ్।
ప్రసన్న వక్త్రారుణలోచనం వృతం, దదర్శ సిద్ధేశ్వర మండలైః ప్రభుమ్.॥

ఈ శ్లోక భావాన్ని సింగయ్యగారి సీసపద్యంలో చిత్తగించండి -

తార హార పటీర ధవళదేహము వాని రమణీయ నీలాంబరంబు వాని
మణి కిరీట స్ఫురన్మస్తకంబుల వాని కంకణ కేయూరకముల వాని
కర్బుర మయదీప్త కటిసూత్రముల వాని తరళ యజ్ఞోపవీతముల వాని
అతి సుప్రసన్న వక్త్రాంబుజంబుల వాని తరుణ వివృత్త నేత్రముల వాని

సిద్ధమండలంబు సేవింపఁ బుణ్య ప్ర, సిద్ధి వెలసినట్టి యిద్ధచరితు
పద్మలోచనునకుఁ బాద పీఠంబై న, ఘనునిఁ బన్నగేంద్రుఁ గాంచె నతఁడు. (షష్ఠ. స్కం. 476)

శబ్దసౌందర్యానికి పేరెన్నికగన్న పోతన్నగారి అంత్యప్రాస నియమాలనూ, యమక గమకాలనూ పుణికి పుచ్చుకున్నారు సింగయ్యగారు -

ఆ విద్యాధరభర్త గాంచె హరనీహారామృతాహాసమున్
శ్రీవిభ్రాజితమున్ నిర స్తగిరిజా సేవాగతాయాసమున్
దేవానీక వికాసమున్ శుభమహాదేవాంఘ్రిసంవాసమున్
భూవిఖ్యాత విలాసమున్ ద్రిభువనీ పూతంబుఁ గైలాసమున్. (షష్ఠ.స్కం.487)

కింకరుల, ధర్మరాజ వ, శంకరుల, దురంత దురిత సమధికజన నా
శంకరుల, సకలలోక భ, యంకరులం గనియె నింద్రియాకులుఁ డగుచున్. (షష్ఠ.స్కం.68)

హరి భక్తులతో మాటలు, ధర నెన్నఁడుఁ జెడని పుణ్యధనముల మూటల్
వర ముక్తికాంత తేటలు, నరిషడ్వర్గంబు సొరని యరుదగు కోటల్. (షష్ఠ.స్కం.153)

నవయౌవనంలో అడుగుపెట్టిన అజామిళుని మీసాలను కనులకు కట్టించే ఈ అందమైన కందంలోని ఔపమ్యం రమ్యంగా ఉంది -

తమ్మివిరి మీఁదవ్రాలిన, తుమ్మెద పంక్తులునుబోలెఁ దోరపు లీలం
గ్రమ్ముకొని విప్రతనయుని, నెమ్మొగమునఁ గానఁ బడియె నెఱి మీసమ్ముల్. (షష్ఠ.స్కం. 93)

వీరాధి వీరుడైన వృత్రాసురుని అవక్రపరాక్రమానికి పరాజితులైన ఇంద్రాది దిక్పాలురు వాసుదేవునితో తమ భంగపాటు విన్నవించుకొన్న సన్నివేశం చాలా చమత్కారంగా చిత్రించాడు సింగయ.

మొదలాఱిన రక్కసులకు, మొదలై, మా కాపదలకు మూలం బగుచున్
దుది మొదలు లేని రక్కసు, తుదిఁ జూపఁగదయ్య! తుదకుఁ దుదియైన హరీ! **(ష.స్కం. 338)**

మొదలాఱుట చక్కని జాతీయం. తిట్టేటప్పుడు "ఓరీ నీ మొదలార!" అంటారు. దిక్కులేనివారం దిక్కుమాలిన వారమైనా మంటున్నారు -

అకట దిక్కులకెల్ల దిక్కైన మాకు, నొక్కదిక్కును లేదు కాలూన నైన;
దిక్కుగావయ్య! నేఁడు మాదిక్కుఁజూచి, దిక్కులేకున్న వారల దిక్కునీవ. **(షష్ఠ. స్కం. 339)**

ఈ క్రింది పద్యంలోని తెనుగుదనం తిలకించండి -

ఎన్నఁడుఁ దెలియఁగ నేరరు పన్నగపతిశాయి తత్త్వభావము, మేనం
గన్నులవేల్పును, డాపలఁ జన్నమరినవేల్పు, ముదుక చదువుల వేల్పున్. **(షష్ఠ. స్కం. 117)**

తీయ తీయని జాతీయాలు సింగయ కవితలో కుప్పలు తెప్పలు -

చదువు చట్టువడియె; శాస్త్రంబు మన్నయ్యె; బుద్ధి పరువు మేసె; పుణ్యమడఁగె;
నీతి మట్టు వడియె; నిర్మల జ్ఞానంబు, ముట్ట నుడిగె, బోధ మూరిఁబోయె. **(షష్ఠ. స్కం.135)**

ఈ విధంగా చెప్పుకుంటూపోతే గ్రంథమంతా ఉదాహరించ వలసి వస్తుంది. షష్ఠస్కంధంలో అజామిళోపాఖ్యానం, వృత్రాసుర జన్మ వృత్తాంతం, దధీచి మహర్షి త్యాగం, దేవాసురయుద్ధం, చిత్రకేతూపాఖ్యానం మొదలైనవి చాలా రసవత్తర ఘట్టాలు. సింగయగారు వీటిని ఎంతో సమర్థంగా అనువదించారు.

పోతన్నగారి కవిత్వమంత ప్రసన్న మధురమూ సర్వాంగ సుందరమూ కాకపోయినా సింగయ్యగారి రచన దాదాపు సహజ పాండిత్యుని అడుగు జాడలలో నడచిందనటంలో సంశయం లేదు.

ఏర్చూరి సింగయ్యగారే కాక నంది మల్లయ, ఘంట సింగయ అనే జంటకవులు "శృంగారషష్ఠం" అనే పేరుతో భాగవతషష్ఠస్కంధాన్ని తెనిగించారు. కాని ఆ గ్రంథం నేడు ఉపలబ్ధం కాదు. అందలి కొన్ని పద్యాలు మాత్రం అప్పకవీయంలోనూ, కూచిమంచి తిమ్మకవి "సర్వలక్షణ సారసంగ్రహం" లోనూ ఉదాహృతాలైనాయి.

16వ శతాబ్దం వాడైన హరిభట్టుకూడా షష్ఠస్కంధాన్ని ఆంధ్రీకరించాడు. ఇది అముద్రితం. దీని తాళపత్రప్రతులు లభిస్తాయి.

ఎందరు కవులు అనువాదం చేసినా సింగయ్యగారి అనువాదమే పోతన్నగారి భాగవతంలో చోటు చేసుకోటం విశేషం. అది సింగయ్య గారి జన్మాంతర సుకృత విశేషం.

సహజ సుందరమైన సహజపాండిత్యుని భాగవతం ప్రతిపద్య భావార్థ సహితంగా ప్రకటితం కావడం ఆంధ్రులందరికీ ఆనందకరమైన విషయం.

ఈ షష్ఠస్కంధాన్ని సరళ సుందరంగా గద్యంలో అనువదించిన వారు విద్వాన్ శ్రీ తలమర్ల కళానిధిగారు.

ఈ షష్ఠస్కంధాన్ని ముచ్చటగా ముద్రించి ఇచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజరు శ్రీ విజయకుమార్‌రెడ్డి గారికి, వారి సిబ్బందికీ నాసాధువాదాలు. అక్షరదోషాలు దొర్లకుండా సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన పూజ్యమిత్రులు మహాకవులు శ్రీముదివర్తి కొండమాచార్యులవారికి నాధన్యవాదాలు. ముద్రణకు తగునట్లు ప్రెస్‌కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ ఎమ్.ఏ., ఎమ్,ఫిల్.,కు నా ఆశీర్వాదాలు.

భవదీయుడు

కరుణశ్రీ

ప్రధాన సంపాదకుడు

పోతన భాగవతం

గుంటూరు

మకర సంక్రాంతి, ప్రభవ